## క్లుప్తంగా

### ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి



వాటర్ డ్రమ్ముల్లో దోమల లార్వాను పరిశీలిస్తున్న డీఎంఓ వెంకటేశ్వరరావు

**అల్లవరం:** ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని జిల్లా మలేరియాధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. డి.రావులపాలెంలో శుక్రవారం చేపట్టిన డ్రై డే కార్యక్రమంలో డీఎంఓ హాజరై గ్రామస్తులకు డ్రై డేపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, కొబ్బరి బొండాలు, టైర్లలో నీరు ఉంటే అందులో దోమల లార్వా పెరిగే అవకాశం ఉందన్నారు. లార్వాని నియంత్రిస్తే మలేరియా, డెంగీ వ్యాధుల నివారణ సాధ్యమని డీఎంఓ తెలిపారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సుమ, ఎస్‌యూఓ రామారావు, ఎంపీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### కాలేయ వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు




అమలాపురంలో ప్రదర్శన నిర్వహిస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్‌ల ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యుల సహకారం, ప్రోత్సాహంతో స్థానిక మెడ్ యునైటెడ్ హాస్పిటల్‌లో ఉచితంగా కాలేయ వైద్య పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. దాదాపు రూ.5 వేల విలువ చేసే పరీక్షలను ఉచితంగా అందించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ కేపీఆర్ కిషోర్ ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనేక మంది ఉచితంగా కాలేయ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం హాస్పిటల్ వద్ద వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ప్రదర్శన నిర్వహించారు. అందరూ నడవాలి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ పిలుపునిచ్చారు. వాకర్స్ క్లబ్ కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, ఉపాధ్యక్షుడు నూకల సత్యనారాయణ, వాకర్స్ డైరెక్టర్లు మోకా వెంకట సుబ్బారావు, వలవల రెడ్డినాయుడు, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వై.అనంతలక్ష్మి, కార్యదర్శి పుత్సా రాజేశ్వరి పాల్గొన్నారు.

### రక్షణగోడ నిర్మాణ ప్రాంతాల పరిశీలన



రక్షణగోడ నిర్మాణ ప్రాంతాలను బోటులో ప్రయాణిస్తూ పరిశీలిస్తున్న కేంద్ర బృందం

**యానాం:** గోదావరి వరదలకు యానాంతో పాటు నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాలను ముంపు నుంచి రక్షించే విధంగా చేపట్టనున్న రక్షణ గోడ నిర్మాణ ప్రాంతాల్లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా కనకాలపేట నుంచి నియోజకవర్గ శివారు తీరప్రాంత గ్రామం సావిత్రినగర్ వరకు రక్షణ గోడ నిర్మాణానికి గతంలో పుదుచ్చేరి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించడంతో కేంద్ర ఉన్నతాధికారి ప్రభాస్‌చంద్ర నేతృత్వంలో నిపుణుల బృందం గోదావరిలో ప్రత్యేక బోటులో పరిశీలించింది. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పీడబ్ల్యూడీ అధికారులు రక్షణగోడ ఆవశ్యకతను కేంద్ర బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, రెవెన్యూ, పీడబ్ల్యూడీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆర్‌బీకే వ్యవస్థకు గ్రహణం

- అసంపూర్తిగా ఆర్బీకే భవనాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నిరుపయోగంగా మారి శిథిలమవుతున్న నిర్మాణాలు



గోగుల్లంకలో నిరుపయోగంగా ఆర్‌బీకే భవనం



మురమళ్లలో అసంపూర్తిగా ఆర్‌బీకే భవనం

**ఐ.పోలవరం:** రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతుకు సంబంధించిన పొలం వద్దకు సిబ్బంది వెళ్లి సాగుదారులకు సాంకేతిక సలహాలు, ఆధునిక సాగు పద్ధతులు వివరించేవారు. అధికారులు ఈ కేంద్రాల ద్వారా రైతులకు పలు రకాల సేవలందించారు. ఈ- క్రాప్, పంట నష్టం నమోదును వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులైన రైతులకు రుణాలు, రాయితీలు త్వరితగతిన అందించేందుకు ఆర్‌బీకేలు దోహద పడ్డాయి. పంట నష్టపోతే రైతులకు రెండు, మూడు నెలల్లోనే పరిహారం అందేలా ఆర్‌బీకేల సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరించేవారు. వ్యవసాయ పంటలకే కాకుండా ఆర్‌బీకేల కేంద్రంగా ఉద్యాన, వెటర్నరీ, ఆక్వా, సెరీ కల్చర్ రంగాలకు కూడా వారు సేవలందించేవారు. దీంతో రైతులకు పలు రకాలుగా మేలు చేకూరింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆర్‌బీకేలకు గ్రహణం పట్టినట్టయ్యింది.

**కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం**

కూటమి ప్రభుత్వం ఆర్‌బీకేల వ్యవస్థ నిర్వీర్యం చేస్తోంది. ఈ-క్రాప్ నమోదుతో సహా పలు రైతు అనుకూల, రైతు ప్రయోజన కార్యక్రమాలు ఒకదాని తరువాత ఒకటిగా ఎత్తివేస్తోంది. పంటల బీమాను ప్రైవేట్ కంపెనీలకు అందించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. గత ప్రభుత్వం అన్నదాతలకు రైతు భరోసా సొమ్ము ఏటా రూ.13,500 చొప్పున ఇవ్వగా తాము అధికారంలోకి వస్తే రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని ఇప్పటి వరకు పట్టించుకోలేదు. ఇప్పుడు హడావిడిగా లబ్ధిదారులను జాబితాను సిద్ధం చేస్తున్నారు. సొమ్ములు ఎప్పుడు వేస్తారనేది స్పష్టత లేదు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు అంతంత మాత్రమే. ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు కూడా అంతంత మాత్రమే. ఆర్‌బీకేల ద్వారా ఆక్వా రైతులకు నాణ్యమైన రొయ్య పిల్లలు (సీడ్) అందించేందుకు గత ప్రభుత్వం ఏర్పాట్లు చేయగా, ఇప్పుడు పట్టించుకునేవారే కరువయ్యారు.

**ఆగిన ఆర్‌బీకేల నిర్మాణ పనులు**

ఐ.పోలవరం మండలంలో ఆర్‌బీకేల నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దాదాపుగా నిలిచిపోయాయి. మండలంలో మొత్తం 19 ఆర్‌బీకేలు నిర్మించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో మండల పరిధిలోని గోగుల్లంక నిర్మాణం పూర్తి కాగా, మిగిలిన చోట్ల నిర్మాణ దశలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నా నిర్మాణాలు ఆగిపోవడంతో ఒక్కటి కూడా పూర్తి కాలేదు. గ్రామీణ ప్రాంతంలో రైతులకు ఎన్నో రకాలుగా మేలు చేసే ఆర్‌బీకే వ్యవస్థపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై మండల పరిధిలో రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం నిర్మాణ దశలో ఉన్న ఆర్‌బీకేలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

## ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

**ముమ్మిడివరం:** మండల పరిధిలోని అనాతవరం వై.జంక్షన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీ కొన్నాయి. చేపల లోడుతో వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఢీకొన్న లారీలు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు లారీలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## ఆస్పత్రులు, సినిమా థియేటర్లలో తనిఖీలు



అమలాపురంలోని ఓ సినిమా థియేటర్‌లో బాంబ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పట్టణ ఎస్సై కిషోర్‌బాబు

**అమలాపురం టౌన్:** అనుమానిత ప్రాంతాల్లో పట్టణ పోలీసులు బాంబ్ డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లతో కలసి రెండో రోజు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్, పార్శిల్ సర్వీస్ సెంటర్లతో గురువారం తనిఖీలు నిర్వహించారు.పలు ఆస్పత్రులు, సినిమా థియేటర్లను శుక్రవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో పట్టణ ఎస్సై ఎస్‌ఆర్ కిషోర్‌బాబు సిబ్బందితో ఈ తనిఖీలు చేపట్టారు. అపరిచిత వ్యక్తుల రాక, విధ్వంసాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో, బాంబులు పెట్టే ఆస్కారమున్న చోట్ల ముందు జాగ్రత్త చర్యలుగా ఈ తనిఖీలు చేపట్టినట్లు సీఐ వీరబాబు తెలిపారు. పలు సినిమా థియేటర్లతో డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్ సిబ్బందితో తనిఖీలు చేశారు.

## ప్రభుత్వ లాంఛనాలతో రాజారావు అంత్యక్రియలు

**యానాం:** ఫ్రెంచి పాలనాకాలంలో, అనంతరం పుదుచ్చేరి స్పెషల్ బ్రాంచ్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన శనివారం ఆకస్మిక మృతిచెందిన యానాంకు చెందిన మంచాల వెంకట మాచర రాజారావు (97) అంత్యక్రియలను అధికారికంగా ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కురసాంపేట వద్ద నున్న హిందూ శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ అడలరసన్, ఎస్సై పునీత్‌రాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కనకమహాలక్ష్మీ అమ్మవారి ఆలయం తొలగింపుపై వివాదం

**గ్రామంలో విచారణ చేపట్టిన తహసీల్దార్**



ఆలయం తొలగింపుపై విచారణ చేస్తున్న తహసీల్దార్ నరసింహరావు, ఎస్సై తిరుమలరావు

**అల్లవరం:** కొమరగిరిపట్నంలో రెండు శతాబ్దాలుగా గ్రామ దేవతగా కొలుస్తున్న కనకమహాలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని ఏకపక్షంగా కూల్చివేశారని గ్రామానికి చెందిన బైరిశెట్టి రామారావు కలెక్టర్‌కు, ఇతర అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో తహసీల్దార్ వీవీఎల్ నరసింహరావు, ఎస్సై తిరుమలరావు కొమరగిరిపట్నంలోని రామలయం వద్ద శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామదేవతగా కొలుస్తున్న కనకమహాలక్ష్మీ అమ్మవారి ఆలయానికి 1958లో గ్రామానికి చెందిన గెద్దాడ మసేను భార్య వెంకాయమ్మ తన సొంత నిధులతో మరమ్మతులు నిర్వహించారని ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం ఈ ఆలయం బాగానే ఉన్నా గునిశెట్టి రోహిణీకుమార్, సంగీతం వెంకటేష్, ఆకుల మధుసూదనరావు, ఆకుల రామం తదితరులు వివిధ సామాజిక వర్గాలకు చెందిన పెద్దలను, ఆలయ మరమ్మతులు చేసిన గెద్దాడ కుటుంబీకులను సంప్రదించకుండా ఏకపక్షంగా వ్యవహరించి ఆలయాన్ని కూలివేశారని గ్రామస్తులు వివరించారు. ఏటా నిర్వహించే ఉత్సవాలకు గ్రామస్తులు తమ వంతు ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దౌర్జన్యంగా ఆలయాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకు నిర్మాణంలో ఉన్న ఆలయ పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కడలి శ్రీనివాసరావు, బొంతు సత్యనారాయణ, పితాని సత్యనారాయణ, గెద్దాడ జాన్‌తాతారావు, పితాని శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## నందీశ్వరునికి అభిషేకం

**తాళ్లరేవు:** సుంకరపాలెంలో వేంచేసియున్న భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నందీశ్వరునికి అభిషేకం నిర్వహించారు. త్రయోదశి సందర్భంగా అర్చకుడు శ్రీకంఠం గిరిబాబుశర్మ ఆధ్వర్యంలో దంగుడు బియ్యం వీర వెంకట సత్యన్నారాయణ, సత్య దంపతులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసారు. నందీశ్వరునికి అభిషేకం చేసేందుకు దాత సత్యనారాయణ రూ.42 వేలు విలువచేసే వెండి బిందెను సమర్పించారు.



# ఓడలరేవు తీరంలో మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న మెరైన్ సీఐ ఎంవీఎస్ఎన్ మూర్తి, తదితరులు

**అల్లవరం:** ఇండో-పాక్ యుద్ధ నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సీఐ ఎంవీఎస్ఎన్ మూర్తి అన్నారు. శత్రు దేశం నుంచి ప్రమాదం పొంచి ఉన్నందున ప్రజలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై మెరైన్ సీఐ ఆధ్వర్యంలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. మెరైన్, ఓఎన్‌జీసీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు, అనుమానాస్పద వస్తువులు కనిపించినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సైరెన్ మోగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ అధికారులు, పోలీసులు, మెరైన్ పోలీసులు, మహిళలు పాల్గొన్నారు.

## 22న అసిస్టెంట్ రెండవ ఫేజ్ పరీక్ష

**యానాం:** పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న రెండవ ఫేజ్ పోటీ పరీక్ష ఈనెల 22న ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం డీపీఅండ్ ఏఆర్ కార్యదర్శి వి జయశంకర్ తెలిపారు. ఈనెల 15న నిర్వహించిన టైర్-1 పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు టైర్-2 పరీక్షను నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ తదితర వివరాలకు 'రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్' ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

# రోడ్డు ప్రమాదాలను నివారించాలి



డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న డీటీఓ శ్రీనివాసరావు, ప్రజా రవాణాఅధికారి రాఘవ కుమార్

**అమలాపురం రూరల్:** ఆర్టీసీలో రోడ్డు భద్రత ప్రమాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలను నివారించాలని జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావు అన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపోలో డ్రైవింగ్ స్కూల్ ద్వారా హెవీ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 16 మంది డ్రైవర్లకు డీటీఓ శ్రీనివాసరావు, ఆర్టీసీ ప్రజా రవాణాఅధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్ శుక్రవారం సర్టిఫికెట్లు అందించారు. అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ శిక్షణ కళాశాలలో డ్రైవర్లకు ఉత్తమ శిక్షణ అందిస్తామన్నారు. త్వరలో జూన్ నెల రెండవ వారంలో 11వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎండీ రజాక్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ సెల్ నంబర్ 7382909588 సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ దేవి, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ప్రతిమాకుమారి, సెక్యూరిటీ ఎస్సై రామారావు, ఏపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎస్ వరహాలబాబు పాల్గొన్నారు.

## కమనీయం కురంగేశ్వరుని కల్యాణం



పాతకోరంగిలో కురంగేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

**తాళ్లరేవు:** చరిత్ర ప్రసిద్ధిగాంచిన పాతకోరంగి బాలత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఆలయ ఈఓ కేవీవీ వేణుగోపాల్ పర్యవేక్షణలో వైశాఖ ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్, వేద పండితులు కందికొండ బాబీ శర్మ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

**ఘనంగా కేశవస్వామి కల్యాణం**

**తాళ్లరేవు:** శ్రీదేవీ, భూదేవి సమేత కేశవస్వామి కల్యాణోత్సవాన్ని తాళ్లరేవు కేశవపురంలో కమనీయంగా నిర్వహించారు. ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు పెద్దింటి శ్రావణ్‌కుమార్ ధ్వజారోహణ అనంతరం కల్యాణోత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణ వేదికపై స్వామివారి కల్యాణాన్ని గురువారం రాత్రి వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గాదిరాజు సత్యన్నారాయణ రాజు పాల్గొన్నారు.

# రక్త పింజర హతం



హతమార్చిన రక్త పింజర →

**మామిడికుదురు:** మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద భారీ రక్త పింజర శుక్రవారం కలకలం రేపింది. డొంకల్లో నక్కిన రక్త పింజరని చూసిన స్థానికులు దాన్ని కొట్టి హతమార్చారు. దీని పొడవు ఐదు అడుగులకు పైగా ఉందని వారు తెలిపారు. దాని పొట్టలో పిల్లలు ఉన్నాయన్నారు. ఇటీవల కాలంలో రక్త పింజర్లు పలు ప్రాంతాల్లో కనిపిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

## ఘనంగా సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

**అమలాపురం రూరల్:** పాత బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న పద్మావతి ,అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి వారి తీర్థ కల్యాణ మహోత్సవాల సందర్భంగా శ్రీనివాస బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. బ్రహ్మ శ్రీ కారుపర్తి మల్లేశ్వరరావు అర్చకత్వంలో 108 మంది మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చన వేద మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అంకం నాగ సత్యనారాయణ, పద్మావతి దంపతులు స్వామి, అమ్మ వార్లకు అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన శేష వాహనంపై స్వామి,అమ్మ వార్లను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అంకం హిమ భారతి, శ్రీనివాసా బాలమిత్ర సంఘం ప్రతినిధులు చింతపట్ల బాబు, చింతా హేమ, లక్కింశెట్టి లూలి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్ విజయం కోరుతూ ఆలయాల్లో పూజలు

**అమలాపురం టౌన్:** పాకిస్థాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్-2 విజయవంతం కావాలని ప్రార్థిస్తూ స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో గల శ్రీ వైష్ణవి కనకదుర్గమ్మ ఆలయంలో బీజేపీ నాయకులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన మంత్రి మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంశాఖ మంత్రి అమిత్ షా, భారత త్రివిధ దళాల శ్రేయస్సును కోరుతూ పూజలు చేయించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు అరిగెల తేజ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి మిత్ర కిట్‌లు సిద్ధం

**ఉప్పలగుప్తం:** పాఠశాల పునః ప్రవేశానికి ముందే ప్రతీ విద్యార్థికి ప్రభుత్వం సమకూర్చిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్‌లను అందించాలని అబ్జర్వర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అబ్జర్వర్ షేక్ అబ్దుల్ ఘని మండల విద్యాశాఖాధికారులకు సూచించారు. గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. సమగ్రశిక్ష సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎమ్ఈవోలు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ పాల్గొన్నారు.

## రేషన్‌కార్డుల మార్పు కోసం ప్రత్యేక కమిటీ

**యానాం:** నియోజకవర్గ పరిధిలో పసుపురంగు రేషన్‌కార్డు (ఏపీఎల్) కార్డులను ఎరుపు రంగు రేషన్ కార్డు (బీపీఎల్)గా మార్చుకునేందుకు దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులైన వారి కోసం ఇంటింటికీ వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలనకు ప్రత్యేక కమిటీని నియమించినట్లు శుక్రవారం ఆర్‌ఏఓ మునిస్వామి తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 22 రేషన్ దుకాణాలల్లో ఈ మార్పునకు అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయ విధానం లాభదాయకం

**తాళ్లరేవు:** ప్రకృతి వ్యవసాయం విధానం రైతులకు లాభదాయకమని వ్యవసాయశాఖ కరప సబ్‌డివిజన్ అధికారి బాబూరావు అన్నారు. శుక్రవారం పి.మల్లవరం పంచాయతీ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన రైతు గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కృషి అమృత్ గోవు ఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రం రైతు ధూళిపూడి వెంకటరమణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయాలనుకునే రైతులకు పూర్తిసహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులను సత్కరించి మామిడి మొక్కలు, విత్తనాలు అందజేసారు. సర్పంచ్ పంపన రామకృష్ణ, రైతులు అబ్బిరెడ్డి నాగేశ్వరరావు, దడాల సత్తికొండ, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌ఎల్‌వీ అధ్యక్షుడిగా సబ్బతి

**యానాం:** పుదుచ్చేరి ఆర్‌ఎల్‌వీ జననాయగ రాజకీయేతర ప్రజాసమస్యల పోరాట సంస్థ యానాం నియోజకవర్గ అధ్యక్షుడిగా సబ్బతి శ్రీనివాస రావును నియమిస్తూ శుక్రవారం ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఆర్‌ఎల్ వెంకట్రామన్ సంబంధిత నియమక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తనకు నియామక ఉత్తర్వులు అందాయని శ్రీనివాస రావు తెలిపారు.